'నక్సలైట్'

— పింగళి రంగారావు

చీకటి పడబోతోంది—

ఎంత సేపటినుంచి ఎదురు చూసినా బస్సు వచ్చే జాడల్లేవు. ఈ బస్సు తప్పితే, సిటీకి పోయేందుకు మరో బస్సు లేదు. గుంపులు గుంపులుగా రోడ్డుపక్క జనం. వెధవ స్టేజి కూర్చునేందుకు షెడ్ అయినా లేదు. అలవాటుగా బస్సు ఆగుతుందిక్కడ. మందంతా యిక్కడే నిల్చుంటారు. ఇది స్టేజి— వేరే ఆధారం లేదు... దూరంగా పొలాల్లో పనిచేసే కూలీలు మోపులెత్తుకొని వూగుతూ నడుస్తున్నారు. పక్క వూళ్ళో అంగడివల్ల మంది మరీ ఎక్కువగా వున్నారు. బస్సు వస్తే యింత మంది ఎలా ఎక్కాలో! బస్సులో యింత మందే ఎక్కాలనే రూలేం లేదు. ఎంతమందైనా ఎక్కేయగలరు— అసహనం పచార్లు చేయిస్తోంది. రకరకాల చర్చలు, చర్చలు విన్నకొద్దీ కొంత మందికి భయం! కొంతమంది ఉత్సాహంగా సిగరెట్లు గుంజుతున్నారు. తలపాగాల మనుషులు, వైట్ పాంట్ల మనుషులు, ధోతులు, పైజామాలు అన్ని రకాలవాళ్ళు ఈ స్టేజి మీద....దూరంగా వినవస్తున్న కూలీల పాటలు. రోడ్డును క్రాస్ చేస్తూ పొలంలోకి దిగుతున్న ఎద్దులు, బర్రెలు. కవ్వం చిలుకుతున్నట్లుగా నీళ్ళ చప్పుడు. చీకటి పడబోతోంది. వేపచెట్టుమీద రెక్కలు సవరించుకుంటున్న పక్షుల చప్పుడు—నిశ్శబ్దంగా పడుకున్న నల్లతాచులా మెలితిరిగి తలాతోకా తెలియని రోడ్డు. ఇంకా బస్సు వచ్చే సూచనల్లేవు........

ఏదో శబ్దం.

బస్సు....బస్సొస్తోంది—

అందరి కళ్ళూ రోడ్డునే చూస్తున్నాయి.

వేగంగా దూసుకొస్తోంది.

పెద్దగా అరుపులు: ఆపండి....ఆపండి....అని పొలాల్లోంచి గొంతులు మొత్తుకుంటున్నాయి.

"ఏదో ప్రమాదం—"

"ఎవరో చచ్చిపోయారు."

"అపాయ్"

అడ్డంగా నిలవండి."
"రాళ్ళందుకోండి."
"లైన్....లైన్‌గా నిలవండి."
రంయ్‌మన్న మోతతో కారు వస్తోంది.
"ఆపండి!" పెద్దగా నీడల్లా పరుగెత్తుకొస్తున్న మనుషులు.
ఒకళ్ళ చేతులు వొకళ్ళం పట్టుకొని బ్యారికెట్లలా నిల్చున్నాం.

కీచుమంటూ రోడ్డు మొత్తుకొంది. అందరం పరిగెత్తాం. కారాగింది. ప దండి అంటూ ముందుకురికాం. ఆపి నట్లే ఆపి కారును పక్కకు కోసాడు. రోడ్డు కింద బురదలో పైర్లు గీ అంటూ తిరగాయి.

స్టీరింగ్ ముందునుంచి అతను దిగాడు. ఎత్తుగా బలిసి వున్నాడు. గొంగళి పురుగుల్లా గుబురుగా మీసాలు. ఎర్రగా వున్నాడు. కళ్ళు కూడా ఎర్రగానే-స్టీరింగ్ పక్కనే ఆడమనిషి. అతని లాగే ఉంది. భీతహరిణలా చూపులు. మెళ్ళో రవ్వల నెక్లెస్. చెవులకు భయంతో వూగుతున్న రింగులు. డోరును కోపంతో విసిరాడు. నీటి మీద బోటులా వూగింది కారు.

"వాట్ హాపెన్డ్. ఎందుకాపారు కారు. దౌర్జన్యం చేస్తారా!"
తీక్షణంగా అన్నాడు.
ఆమె అతన్ని, అందర్ని మార్చి మార్చి చూస్తోంది.

"ఆపండి అని అరుపులు వినవస్తే ఆపాం. కాని దౌర్జన్యం చేయ కాదండీ" అన్నాను.

"మేం ఆపుతున్నా మీరెందుకలా నడిపారు."
"మనల చంపాలని."
దూరం నుంచి యిద్దరు వ్యక్తులు పరుగెత్తుకొస్తున్నారు.

"ఊ....ఊ....పక్కకు తప్పుకోండి. ఏమీ జరుగలేదు." అంటూ స్టీరింగ్ ముందుకు నడిచాడు.

"వాళ్ళు రానీయండి."
"నా కారును నాశనం చేశారు."
"మీ కారేం కాలేదండీ. బురదలో దిగబడింది. తప్పు మీది కాని మాది

కాదు. అయినా మీకు శ్రమ కలిగించం. యింత మందిమి వున్నాం. ఎత్తి రోడ్డు మీద పెట్టగలం." అన్నాను.

వాగరుస్తూ వాళ్ళు దగ్గరి పడ్డారు.
"ఏంట్రా ఏం జరిగింది."
"ఆవుని చంపొచ్చాడు." అంటూ శ్వాస ఎగబోస్తున్నారు.
"ఆవు చస్తే వచ్చింది. దాని కోసం కారు ఆపాలా."
"డబ్బు కట్టి మరీ కదలాలి."
"మనిషి చచ్చినా అంతే అన్నమాట."
"వాళ్ళకు మనిషి చస్తేనేం, ఆవు చస్తేనేం."

తలో రకంగా విరుచుకు పడుతున్నారు. గుంపు వెనకగా వున్నవాళ్ళు యిష్టం వచ్చిన బూతులు పలుకుతున్నారు. తన్నండి, దాన్ని కిందకు గుంజండి అంటున్నారు. అతను సిగరెట్టును పెదవుల కొసన ముట్టిస్తూ వాళ్ళతో మాట్లాడుతున్నాడు. అందరి గొంతుల్లోనూ ఆవేశం. వెనక నుంచి ముందుని తోస్తున్నారు. కారు అద్దాలమీద చేతులానించి కారు మీద పడకుండా నిలదొక్కుకుంటున్నారు ముందున్నవాళ్ళు. కారు డిక్కీ మీద మద్దెల మోగుతుంది. కొందరు పక్కకు చేరి గుసగుసలు....

ఆమె ఏడుస్తోంది.
"లంజె సూడు ఎట్లా ఏడుత్తోందో."
"నీ అమ్మ....ఆవుని చంపిపోతారు."
"దబాయిస్తాండు సూడు లంజెకొడుకు."
"వీని పెళ్ళాం.

'ఏయ్! అనవసరంగా ఎందుకు తిడుతారు. మీకేం సంబంధం. కారు దగ్గర నుండి జరగండి మొదలు. ఊఁ జరగవయ్యా.'

'గీ-దయే పనికిరాదు.'
'పనికిరాక ఏం చేద్దామో చెప్పండి.' అన్నాను అసహనంగా.
'తందాం.' గుంపులోంచి.

'ఈ పరిస్థితే మనకేర్పడితే. మీరు ఏడవకండమ్మా! ఏదో ఆవేశంగా అంటున్నారు వాళ్ళు. ఆవు చనిపోయినందుకు వాళ్ళకు డబ్బిస్తే సరి.'
అతనికీ, ఆవు వాళ్ళకూ రాజీ కుదరటం లేదు.

'యివాళో రేపో చనిపోయే ఆవుకు రెండువందలా! నాన్‌సెన్స్.' అంటున్నాడతను.

'అందుకే యిప్పించండా!'

'రెండువందలంటే ఎట్లాగయ్యా. మీరిలా పక్కకు రండి సార్.' అంటూ అతన్ని ఆవువాళ్ళను పక్కకు తీసుకపోయాడు మధ్యవర్తి.

'వీడెవడో మధ్యన.'
హ్యాండ్ బాగ్‌లోని టర్చీఫ్‌తో ఆమె ముఖం తుడుచుకుంది.
మిష్టర్! మీరిలా రండి.' అంది.
కారుకు దగ్గరగా జరిగాను.

'చూడండి. మేం చాలా పని మీద వెళ్తున్నాం. అనవసరంగా మీరంతాకల్సి కారును ఆపారు.'

'వాళ్ళ అరుపులు విని ఆపామండి!'
'మనుష్యుల చిక్కుల్లో పెట్టారు.'
యిందులో చిక్కేముందండీ.'

'మీరు మనసులో ఏదో ఉద్దేశం పెట్టుకొనే కారు నాపారు. ఆవు చనిపోతున్నా మీరు ఆపే వాళ్ళే. యింత మంది యిక్కడ ఎందుకున్నట్లు. మీ చేతుల్లో కట్టెలూ, రాళ్ళూ ఎందుకున్నాయి....మీరంతా నక్సలైట్లా వున్నారు:'

ఆమె మాటతో ఉలికి పోయాను.
'మీరు తొందరపడుతున్నారు. మేమంతా బస్సుకోసం నిల్చున్న వాళ్ళం.
కాని నక్సలైట్లం కాదు. మీకా భయమొద్దు. నేను ప్రభుత్వోద్యోగినని హామీ యిస్తున్నాను.'

"ప్రభుత్వోద్యోగి నక్సలైట్ కాకూడదా! అయినా మీరెందులో పనిచేస్తారు."
"ఆ వివరాలన్నీ మీకెందుకు లెండి." అయిష్టంగా అన్నాను.
"చెప్పటానికేం........"
"స్కూల్ అసిస్టెంట్‌ను."
"ఓహో! ఈ తెలంగాణా వుద్యమం వెనుక వుంది మీరే అన్నమాట."

"అంత క్రెడిట్ మాకివ్వకండి."
"సారీ! యిలా అడిగినందుకు మరేం అనుకోవద్దు."
నేను ఆమెతో మాట్లాడటం చాలా మందికి యిష్టమనిపించలేదు.

ఆమె భయాన్ని చూస్తే జాలేసింది. నా పక్కనే వున్న అతను పక్కకు జరిగి యిద్దర్ని పిల్చుకొని ఏదో చెప్తున్నాడు.

"తొందరగా రావాలి." అంటూ పురమాయిస్తున్నాడు.
వాళ్ళు తొందరగా అడుగులు వేస్తూ వూరివేపు నడుస్తున్నారు.
అతనేం చెప్పాడు వాళ్ళకు!
వాళ్ళెందుకు అంత తొందరగా పరుగెత్తుతున్నారు.
ఆ చెప్పినతను ఆవు వాళ్ళ వేపే మాట్లాడుతున్నాడు రాజీ చెడగొట్టే ప్రయ

నాలో ఏదో అనుమానం. ఎన్నో ప్రశ్నలు.
అతన్ని చూస్తే జాలి కంటే ఆమెను చూస్తేనే జాలి. గొప్పింటి బిడ్డ.

ఎన్నడైనా ఆమె ఏడ్చి వుంటుందా! యింత మంది మధ్య నేరస్థురాలిలా బోనులో నిల్చున్నట్లు....ఎందుకీ దౌర్భాగ్యం. ఎన్నో ప్రశ్నలు సూటిగా, వికృతంగా ఆమె ముఖంమీద విరుచుకపడుతున్నాయి: ఆవు చచ్చిపోయింది. అది యాక్సిడెంటల్. ఉద్దేశపూర్వకంగా చంపి వుంటారా! ఇంతమంది వుండీ వొంటరి వాళ్ళు. యింత మంది ఎవరికీ ఎవరూ కారు. కాని అంతా వొక్కటయ్యారు. న్యాయంవైపు మొగ్గారినా! ఏది న్యాయమని—అతను వున్నవాడు కావడమే నేరం, అన్యాయం. వీళ్ళ కసికి కారణ మదే.

చూపులతో కాలుస్తోన్నారు. మాటలతో శూలాల్లా గుచ్చుతున్నారు.
ఎంత వుంటేనేం, ఈ పరిస్థితుల్లో ఏమీ లేనివాళ్ళు.
ఎంత పరువు వుంటేనేం, యింతమంది ప్రజల తీర్పును ఒప్పుకొనిచావాలి.
అందరి మనస్సుల్లోనూ అల్లరి పెట్టాలనే.
అతను వూళ్ళోకి మనుషుల నెందుకు పంపాడు?
రాజీ పరుచకుండా విషయాన్ని ఎందుకు సాగదీస్తున్నట్లు!

ఈ అదను వుపయోగించుకుంటారేమో. దొంగలు....దొంగలు....యింతలో బస్సు వచ్చింది.

వెళ్ళాలి.... వెళ్ళాలి.... వెళ్ళిపోతే యిక్కడేం అన్యాయం జరుగుతుందో. వాళ్ళనూ, వాళ్ళకారును ఏంచేస్తారో.

బస్సుకదలబోతోంది.
ఆమెనుచూసాను. ఆచూపుల్లోభయందాక్కోలేకపోతోంది.
ఎర్రటి పెదవులు కదులుతున్నాయి, జాలిగా ఆమె కళ్ళు.
చాలమంది బస్సువేపు పరిగెత్తారు; తిట్టుకుంటూ, అరుస్తూ.
బస్సు కదిలి పోయింది.
"మీరు వెళ్ళిపోలేదేం."
"యిదేదో తేలిపోతే మిమ్ముల పంపేయొచ్చు."
'చాలా థాంక్స్!'
"మనిషి మనిషికి ఈ మాత్రం సాయపడకుంటే ఎట్లా."
"మా వారిది కాస్తా దుడుకు స్వభావం. అదేదో మీరే తేల్చండి."
యిప్పుడామె గొంతులో వొణుకులేదు.
"వంద రూపాయలేదో అడుగుతున్నారు. యిచ్చేస్తే సరి."
"అంత మొత్తం యిప్పుడు మావద్ద లేదు. పోనీ ఓ సాయం చేయగలరా."
"చెప్పండి."
సాయం చేయాలన్నదే నా తొందర.

"ఈ బంగారుగాజు తీసుకోండి. వందరూపాయలకు మీరు భరోసా యివ్వండి. డబ్బు పంపి గాజు తెప్పించుకుంటాను. మరోలా అనుకోరుగా."

"నా మీద మాత్రం మీకేం నమ్మకం."
"నమ్మకమే. మీ అడ్రసు యివ్వండి."
"నాస్టీ ఫెల్లోస్." అంటూ అతను విసుక్కుంటూ వచ్చాడు.
ఆమె ప్రశ్నార్థకంగా అతని వేపు చూసింది.
"వంద రూపాయలకు నా వాచ్ వాళ్ళ ముఖాన పారేసాను."
"ఎవరికిచ్చారు" అంది.
"ఆ పెద్దమనిషి రావుగోపాల్‌కు."
"వీరు మనకు హెల్ప్ చేస్తారు."
"వై షుడ్ హీ హెల్ప్ అజ్."
"నమ్మదగిన వాడే, ఆ వాచ్ వీరికే యివ్వండి."

"అవునండి. వీరికిచ్చినా ఫర్వాలేదు. మా స్కూల్ టీచరే."

"ఊం మీరే తీసుకోండి. డబ్బు పారేసి వాచ్ తెప్పించుకుంటాను. అడ్రస్"

తెగతిట్టుకుంటూ, సిగరెట్టు కొరుకుతూ కారు స్టార్ట్ చేశాడతను.

"వంద రూపాయలకే వదిలిపెట్టారా! ఛీ."

అంటూ పళ్లు బిగించాడు యింతకుముందే కొందరిని వూళ్ళోకి పంపినతను.

కారు ఎర్రిలైట్లు దూరమయ్యాయి.

ఏ అన్యాయం. దౌర్జన్యం జరుగకుండానే కారు కదిలిపోయింది.

ఇంత మందినుంచి ఆమెకు ధైర్యం యివ్వగలిగానని, యింతమంది పురుషులు ఆమెను హేళన చేస్తూవుంటే వాళ్ళనెదిరించి వోదార్చగలిగానని, వేలయ్యే వాణికి పోతూవుంటే ఆత్మీయునిలా, మనిషిలా ఆదుకోగలిగానన్న తృప్తి—సిటీకి నడిచి వెళ్తున్నానన్న అలసటను కూడా కలిగించలేక పోయింది,

నా జీవితంలో యింతకంటె గొప్ప అడ్వెంచర్ ఏముంటుందని. ఏ ఒక్కరికీ వున్న వానిమీద సానుభూతి లేకుండా పోయింది. అనాడు ఆ గుంపులో అందరి కళ్ళల్లోనూ కసి. ఆఫీసరు, లక్షల ఆస్తి. అయితేనేం చేతిలో డబ్బులేని వాడయ్యాడు. అంతస్తుని చూడగానే ఈ మనుషులు కళ్ళల్లో నిప్పులు చెరుగుకుంటున్నారు. ఒక్కడికీ దయలేదు ధర్మం సంగతే లేదు. నేను లేకుంటే ఏంచేద్దురో—అతను వూళ్ళోకి మనుషుల నెందుకు పంపినట్టు. ఆయన తిట్టుకున్నాడంటే తిట్టుకోడూ, పరువుపోయాక. ఇంతమంది కలిసి ఒక్కణ్ని చేసి పరువుతీసి, అదను చిక్కగానే దోచుకోవాలనే యీ మనస్తత్వం యిక పెరగొద్దు.

స్కూల్లో సరిగ్గా పాఠాలు చెప్పడానిక్కూడా మనసొప్పటంలేదు.
నేను కూడా సరిగ్గా వాళ్ళకు న్యాయం చేకూర్చలేక పోయాను—
వెధవ వందరూపాయలకు వాచ్‌ను అట్టిపెట్టు కున్నాను,
ఆ క్షణాన చేతిలో డబ్బులేక పోయింది.... వెధవ బతుకు.

వీధిలో ఏ కారు చప్పుడైనా, ఏ జీపు చప్పుడైనా వాళ్ళు వస్తున్నారేమో అనే, రోజులు గడచినా ఎవరూ రావటం లేదేం.

వాళ్ళకీ వస్తువ జ్ఞాపకం వుందోలేదో—
నేనే తీసుకవెళ్ళి యిస్తే బాగుండేదేమో....
వాకిట్లో జీపు ఆగిన చప్పుడు.

పరుగెత్తుకొంటూ వెళ్ళి తలుపు తెరిచాను. ఆ తొందరలో పడబోయాను ఎదురుగా యిన్స్పెక్టర్.

"రాజారావుగారు మీరేనా?"

"అవును ఎందుకూ?"

'మీ మీద వారెంటుంది.'

'వారెంటా? నా మీగా!'

దౌర్జన్యంచేసి కొంతమందితో కల్సి మీరు ఫారెస్ట్ ఆఫీసరును అల్లరి పెట్టారని....మీకు నక్స్‌లైట్ల యాక్టివిటీస్‌తో సంబధం........

యిన్స్పెక్టర్ మాట పూర్తి కాకుండానే అదిరిపోయాను, కాళ్ళకింద భూమి కదులుతూ వుంటే....

జీవంలేని మట్టిబొమ్మలా యిన్స్పెక్టర్‌తో జీపెక్కాను.

పిడుగులు పడుతున్నట్లుగా జీపు శబ్దం.

రోలరులా, బరువుగా కదలివెళ్తున్న జీపుటైర్లు నావాకిట్లో బురదను చల్లుతూ ముందుకు నడుస్తుంటే—

జీపులో శవంలా నేను!